క్లుప్తంగా

ఆపరేషన్ కగార్ ఆపాలి

నూతనకల్ : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర బలగాలు నరమేధాన్ని సృష్టిస్తున్నాయని, తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 27మందిని పోలీసులు పట్టుకొని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ పేరుతో కథలు అల్లుతున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తొట్ల లింగయ్య, కూసు సైదులు, సామ వెంకట్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

అర్వపల్లి: వన మహోత్సవంలో భాగంగా వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఎండల నుంచి సంరక్షించాలని డీఏఓ, మండల ప్రత్యేక అధికారి జి.శ్రీధర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన అర్వపల్లిలోని వన నర్సరీని పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీళ్లు పెట్టాలన్నారు. అలాగే నర్సరీలో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వేయాలని సూచించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఏడీఏ బాలకృష్ణ, ఎంపీడీఓ గోపి, ఏఈఓ నేరెళ్ల సత్యం, నిర్వాహకులు పాల్గొన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి వెంకట్‌రెడ్డికి అతడి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రేఖ దంపతులు

అర్వపల్లి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ– సంగీత దర్శకుడు అగస్త్య దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రికి చిత్రపటాన్ని బహూకరించారు.

చర్యలు తీసుకోవాలి

ఆత్మకూర్ (ఎస్): డ్రెయినేజీ నీరు తమ పొలాల్లోకి రాకుండా అడ్డుగా కట్టిన గోడను కూల్చివేసిన వారి పై చర్యలు తీసుకోవాలని ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన బొల్లె లక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా చేయకపోవడం వలన వీధుల్లో నుంచి వచ్చిన డ్రెయినేజీ నీరు ఊరి వెంట తమకున్న మూడెకరాల వ్యవసాయ భూమి లో చేరుతున్నాయని, దీంతో పంటలు పాడవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు అధికారులకు, జీపీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. దీంతో తమ పంట పొలాలకు డ్రెయినేజీ నీరు వెళ్లకుండా గోడ నిర్మించుకోగా.. దానిని కూల్చివేశారని, గోడ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలగిరి(తుంగతుర్తి): తిరుమలగిరిలో శనివారం సాయంత్రం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ వైపు వెళ్తున్న డీసీఎంను తనిఖీ చేయగా 167 బస్తాల్లో రేషన్ బియ్యం (80 క్వింటాళ్లు) పట్టుబడ్డాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

అర్వపల్లి: మండల పరిధిలోని కొమ్మాలలో సోమవారం జరిగే గంగదేవమ్మ ఉత్సవానికి హాజరుకావాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యాదవ సంఘం నాయకులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. గంగదేవమ్మ ఆలయం వద్ద సీసీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మందడి పూర్ణచంద్రారెడ్డి, మర్యాద వీరయ్య, బయ్య గంగయ్య, రామచంద్రు, రామలింగయ్య, గణేష్, వెంకన్న పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో యాదవ సంఘం నాయకులు

చినుకు పడితే చిత్తడే..



బాలాజీ నగర్‌లో రోడ్డు మధ్యలో చిత్తడిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్‌లైన్



లింగానగర్‌లో బురదమయంగా మారిన రోడ్డు

- గుంతల్లో మురుగు, వర్షపు నీరు నిలిచి అధ్వానంగా మారుతున్న వీధులు
- ఇబ్బందులు పడుతున్న సూర్యాపేట పట్టణంలోని పలు కాలనీల ప్రజలు

సూర్యాపేట అర్బన్ : చిన్నపాటి వర్షాలకే రహదారులపై వరద నిలిచి సూర్యాపేట పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు, సీసీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంతో వరద ప్రవాహం సాఫీగా సాగక రోడ్ల వెంట వాన నీటితోపాటు మురుగు నీరు కూడా చేరుతోందని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. కుడకుడ రోడ్డు నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే 100 ఫీట్ల రోడ్డులోని లింగానగర్ కాలనీలో రోడ్డు మొత్తం ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో ఆ కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని స్నేహనగర్ కాలనీ ప్రధాన రహదారిలో వానొస్తే చాలు గుంతల్లో నీరు చేరి మడుగులుగా మారుతున్నాయి. బాలాజీ నగర్ కాలనీకి వెళ్లే దారిలో గత కొంతకాలంగా మురుగు నిలుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భగత్ సింగ్ నగర్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆ కాలనీలోని ప్రధాన రహదారిపై లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిల్వ ఉండడంతో బాటసారుల, ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. మోకాళ్ల లోతు గుంతల్లో ఆగిన నీటి లోంచి నడవలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అలాగే బాలాజీ నగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం రోడ్డు మధ్యలో తీసిన గుంతల లో వర్షపు నీరు నిలిచి చిత్తడిగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గుంతలను పూడ్చక అవస్థలు

భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి రహదారి మధ్యలో తవ్వకాలు చేపట్టి తర్వాత మట్టితో పూడ్చారు. సీసీ నిర్మాణం చేపట్టలేదు. దీంతో వాహనాల రాకపోకలతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తోంది. వాహనదారులు, బాటసారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు లేకుండా పూడిపించాలి.

– జంపాల నాగయ్య, బాలాజీ నగర్

బాలభవన్ చిన్నారులకు కంటి వైద్యపరీక్షలు



చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా బాల భవన్ సమ్మర్ క్యాంప్‌లో శనివారం బాల బాలికలకు లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు హమీద్ ఖాన్ మాట్లాడారు. పిల్లలు ఎక్కువగా కంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల కంటి చూపును సంరక్షించుకోవచ్చని తెలిపారు. అనంతరం డాక్టర్ బంగారు స్వాతి మాట్లాడారు. నెట్, మొబైల్, టీవీ, కంప్యూటర్ లాంటి టెక్నాలజీని తగిన జాగ్రత్తలు పాటిస్తూ అవసరమైన మేరకే వాడుకోవాలన్నారు. స్క్రీన్ ఎక్కువగా చూడటం వల్ల కంటిలో తడి ఆరిపోయి చూపు దెబ్బతింటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి, బాల్ భవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణ సింగ్, అనిల్, సాయి, వీరు, పద్మ, పేరెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

ఆత్మకూర్ (ఎస్) : పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలంలోని అస్లా తండాకు చెందిన 30 కుటుంబాలు వివిధ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొప్పుల వేణారెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అములు చేస్తోందని తెలిపారు. ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు లేనిపోని కుంటి సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న వేణారెడ్డి

ప్రతిఘటన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

నూతనకల్ : ప్రతిఘటన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి చిల్పకుంట్లలో నిర్వహించిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జెన్ను) నాలుగో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భూస్వామ్య, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాడిన జనార్దన్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య, ప్రముఖ న్యాయవాది కుంట్ల ధర్మార్జున్, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, పెద్దింటి రంగారెడ్డి, దేశోజు మధు, ముప్పాని సుదర్శన్‌రెడ్డి, రమేష్, కూసు లింగయ్య, జటంగి వీరమల్లు, బిక్కి రవి, పులుసు క్రాంతికుమార్, మందడి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ



అర్వపల్లి : ఉపాధ్యాయులకు ధ్యానం, యోగాపై అవగాహన కల్పిస్తున్న ప్రశిక్షకులు



తాళ్లగడ్డ (సూర్యాపేట) : మాట్లాడుతున్న ఎస్‌ఐ

అర్వపల్లి : మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు ఐదు రోజులుగా జరుగుతున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. చివరిరోజు ఉపాధ్యాయులకు ధ్యానం ,యోగా తరగతులపై సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి, ప్రశిక్షకుడు రమేష్‌లు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుతోపాటు ధ్యానం, యోగా చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. బాలునాయక్, ఎంఎన్ఓ కుంభం ప్రభాకర్, రీసోర్స్ పర్సన్లు వి.సైదులు, కె. రమేష్, పి. మల్లయ్య, బి. శ్రీనివాస్, సీహెచ్. నాగరాజు, సృజన, వెంకన్న, స్వరూపరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఉపాధ్యాయులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి బోయిని లింగయ్య అన్నారు. శనివారం వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తరగతి గదులలో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ ఆంజనేయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని జీహెచ్ఎస్ నం.2 పాఠశాలలో సూర్యాపేట మండల పరిధిలోని ఉపాధాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. సైబర్ నేరాల నియంత్రణపై పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, ఎంఆర్‌పీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

నూతనకల్ : మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్‌ఐ భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల రీసోర్స్ భవనంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములునాయక్, ఏఎస్‌ఐ దానియేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వెలుగుపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గూడ వెంకన్న రోజుమాదిరిగా శనివారం ఉదయం కూడా కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాయ్యాయి. గ్రామస్తులు చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అక్రమంగా మట్టి తరలింపు



మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని దుబ్బతండా గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీలు, టిప్పర్లతో భారీగా మట్టి తరలిస్తున్నారు. గత కొద్దిరోజులుగా సమీపంలోని వెంచర్లకు, రైస్ మిల్ నిర్మాణం కోసం ఈ మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ టిప్పర్ల కారణంగా రోడ్లు పాడవుతున్నాయని అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. పంట పొలాల మట్టితోపాటు అప్పుడప్పుడు ఎస్సారెస్పీ కాలువ మట్టిని కూడా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

తహసీల్దార్ వివరణ..

మండల పరిధిలో దుబ్బతండాలో అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయమై తహసీల్దార్ హరి కిషోర్ శర్మను వివరణ కోరగా మట్టి తరలింపుపై తమకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు. ఒక వేళ ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే పోలీసుల సహకారంతో వెంటనే అడ్డుకుంటామని తెలిపారు.

విద్యార్థికి ప్రోత్సాహకం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి : పదవ తరగతి ఫలితాల్లో నాగారం మండలం టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పూజకు తిరుమలగిరిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రూ.2016 నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా పూజను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.సోమేష్, కార్యదర్శి రమేష్, కోశాధికారి గణేష్, గిరి గౌడ్, మమత, ఎం.పద్మారెడ్డి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, రామచంద్రం గౌడ్, సుందర్, ఐత శ్రీనివాస్, బుక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మహ్మదాపురంలో శ్రీకంఠమహేశ్వర–సురమాంబదేవి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడశెట్టి పూజారులు వేదమంత్రాలతో శాస్త్రయుక్తంగా పూజలు జరిపారు. దేవతామూర్తుల విగ్రహాలను అలంకరించి ప్రతిష్ఠ చేశారు. కంఠమహేశ్వర స్వామి, సురమాంబ, కౌండిన్య మహర్షి, కోడి పుంజు, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గుండు అంజయ్య, వీరబాబులు రూ.లక్ష 80వేలతో కొనుగోలు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకంఠమహేశ్వర, సురమాంబ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఫణిగిరిలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ అశోక్

నాగారం : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక లాభాలను పొందవచ్చని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ పి.అశోక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసి రైతులు నెలనెలా ఆదాయం పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు. ఆయిల్‌పామ్ తోట నాటిన నాలుగు ఏళ్ల నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ ఒక ఎకరానికి 10టన్నుల దిగుబడి వస్తుందని, మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలుగా ప్రస్తుతం మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న కూరగాయలు, వాణిజ్య పంటలను సాగు చేసుకోవచ్చని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలనుకున్న రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, పతంజలి ఆయిల్‌పామ్ క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, రైతులు నరసింహారెడ్డి, గట్టు రవీందర్, కొలిశెట్టి సోమేష్, విద్యాసాగర్, సుభాష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొమరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధకులతో పతంజలి శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్ : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇండియన్ యోగా అసోసియేషన్ కన్వీనర్, యోగాచార్యులు పతంజలి శ్రీనివాస్ అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల యోగా చైతన్య యాత్రలో భాగంగా శనివారం ఉదయం హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యోగా శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఇటీవల అరకులో 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసిన కార్యక్రమానికి గిన్నిస్ బుక్‌లో చోటు లభించిందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా చేయాలని సాధకులకు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ మండలి సాధకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాధకులు శ్రీపాద భాస్కరాచారి, వేల్పుల సుధాకర్, గోరంట్ల శ్రీనివాస్, పద్మ, మధు, మాధవి, బాణాల శ్రీనివాస్, కేఎస్.రావు మురళీకృష్ణ, జ్యోతి, లింగయ్య, శ్రీనాథ్, చంద్రశేఖర్, సైదులు, సరిత తదితరులు పాల్గొన్నారు.

‘వైభవం’ సినిమా యూనిట్ సందడి



కేక్ కట్ చేస్తున్న సినిమా యూనిట్ బృందం

సూర్యాపేట : కుటుంబ విలువలు, స్నేహబంధం తెలిపే చిత్రం ‘వైభవం’ అని ప్రముఖ సీనియర్ న్యాయవాది టేకులపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఏసియన్ తిరుమల మల్టీప్లెక్స్‌లో వైభవం సినిమా విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా యూనిట్ సభ్యులతో కలిసి సెకండ్ షో సినిమాలో కేక్ కటింగ్ చేసి మాట్లాడారు. చిత్ర రంగంలో సూర్యాపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది రమాదేవి నిర్మాతగా వారి కుమారులు రుత్విక్ హీరోగా, సాత్విక్ దర్శకులుగా ఉండటం విశేషమన్నారు. సూర్యాపేట వారితో నిర్మితమైన వైభవం సినిమాను అందరూ ఆదరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సినీ హీరో రుత్విక్, హీరోయిన్ ఇక్రా ఇద్రిసి, తారాగణం చక్రి, కల్లూరి లక్ష్మీనరసింహ ప్రసాద్‌లకు యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సినిమా దర్శకుడు సాత్విక్, సూర్యాపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య, సీనియర్ న్యాయవాదులు జె.శశిధర్, గుండ్రాల అశోక్, మీలా రమేష్, రెడ్ క్రాస్ అధ్యక్షురాలు ఇరిగి కోటేశ్వరి, డాక్టర్ దుర్గాబాయి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్ : మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహన యజమానులపై, తల్లిదండ్రులపై చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. పట్టణంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 64 వాహనాలు పట్టుబడ్డాయన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించామని చెప్పారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే గరిష్టంగా రూ.25,000 జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని, అలాగే 25 సంవత్సరాల వయస్సు వరకు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రాదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. రోడ్డు భద్రత, మోటారు వాహన నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సాయిరాం, ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని గీతాంజలి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004 – 05 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా 20 సంవత్సరాల అనంతరం ఒకచోట కలిసి పాత రోజులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులను కలవడం ఆనందంగా ఉందన్నారు. ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో తమ ముందుకు రావడం, సన్మానించడం శుభ పరిణామమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భారతి, కృష్ణ, శ్రీధర్ రెడ్డి, కిషన్, ఇందిర, నిర్మల, విజయ, పూర్వ విద్యార్థులు ఫణీంద్ర, గణేష్, దయాకర్, కృష్ణ, శ్రీకాంత్, రావూఫ్, శ్రావణి, మాలవ్యా, విజిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సాండ్ ట్యాక్సీ బిల్లులు చెల్లించాలి



తుంగగూడెంలో ఏర్పాటు చేసిన మూసీ క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

అర్వపల్లి : సాండ్ ట్యాక్సీ విధానం విజయవంతంగా అమలవుతోంది. గృహ నిర్మాణదారులకు ఈ పథకంలో తక్కువ ధరకు ఇసుకను ఇంటి వద్దకే సరఫరా చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని తుంగగూడెం గ్రామంలో మూసీనది నందు ఏర్పాటు చేసిన మన ఇసుక – మన వాహనం పథకంలో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలలోని ఏడు మండలాలకు ఇసుక సరఫరా జరుగుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ క్వారీ నుంచి ఇసుక రవాణాకు 230 ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చారు. అయితే గత 45రోజుల నుంచి ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్ల బిల్లులు రావడం లేదు. ఒక్కో ట్రాక్టర్ యజమానికి సుమారు రూ.1.50లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. ఈ బిల్లులు రాక అప్పులు తెచ్చి ట్రాక్టర్‌లో డీజిల్ పోసి నడిపిస్తున్నామని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే సాండ్ ట్యాక్సీ బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన మందడి పిచ్చిరెడ్డికి వైద్య ఖర్చుల కోసం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ద్వారా డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి సహకారంతో రూ.29,500 చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శనివారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బాసోజు శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కుంటిగొర్ల శ్రీనివాస్, బొరోజు ఉపేందర్, బన్నరి ఉపేందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

అర్వపల్లి : ప్రజా సేవకులను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని ఎస్‌ఐ సీహెచ్. బాలకృష్ణ, మద్దిరాల తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. అర్వపల్లి తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు బదిలీకాగా శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డిలు వేర్వేరుగా తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ గోపి, గిర్దావర్‌లు జలేందర్ రావు, వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, ఏపీఓ ఉపేందర్, ఈదుల వీరపాపయ్య, మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, కె. ధనలక్ష్మి పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది